


నేడు జిల్లాకు నారా భువనేశ్వరి రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు భార్య నారా భువనేశ్వరి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో ఆవేదనతో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. బుధవారం విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తారు. 4న పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చెల్లూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలకనున్నట్లు టిడిపి విజయనగరం పార్లమెంటు అధ్యక్షులు కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తీరని వేదన.. ఆగని రోదన

- ప్రభుత్వ తీరుపై వినూత్నరూపాల్లో అంగన్వాడీల నిరసనలు
- దున్నపోతులకు వినతులు
- 22వ రోజుకు నిరవధిక సమ్మె



భోగాపురంలో థింసా నృత్యం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. సమ్మె చేపట్టి మూడు వారాలు గడిచినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంగన్వాడీలు పోరాటాన్ని ఉధృతం చేశారు. బొబ్బిలి పట్టణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు సిఐటియు, జనసేన మద్దతు ప్రకటించాయి.. సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీలకు పోరాటానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, పద్మ, ఉమాగౌరి పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరంలో అంగన్వాడీ యూనియన్ విజయనగరం అర్బన్ ప్రాజెక్టు నాయకులు కె.ప్రభ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధం కాబోతు న్నామని తెలిపారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ రోజుకో వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తున్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం జాప్యం చేయడం, మరోవైపు బెదిరింపులకు దిగడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. డిమాండ్లన్నీ నెరవేర్చే వరకూ వెనక్కి తగ్గేది లేదని తెగేసి చెబుతున్నారు. మరోవైపు అంగన్వాడీలకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. పలు రాజకీయ పార్టీలు, ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలియజేస్తున్నారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణ, సుధారాణి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్ మోహన్‌రావు, బి.రమణ సమ్మెకు మద్దతు ప్రకటించారు.

భోగాపురం : భోగాపురంలో అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె శిబిరంలో థింసా నృత్యం చేసి నిరసన తెలియజేశారు. వివిధ రకాల పాటలతో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కొర్లమ్మ, ప్రవీణ, శ్రీదేవి, అనిత పాల్గొన్నారు.



రామభద్రపురంలో సిఎం, మంత్రుల మాస్కులు ధరించిన వారికి మొక్కుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రామభద్రపురం : రామభద్రపురంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరంలో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సిఎం జగన్, మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతల ముఖాలున్న మాస్కులు ధరించి, వారికి నమస్కారం చేస్తూ నిరసన చేపట్టారు. దున్నపోతుకు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు సత్యవతి, రాధమ్మ, కుమారి పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో సమ్మెలో భాగంగా అంగన్వాడీలు దున్నపోతుకు వినతి అందించి, నిరసన తెలిపారు. అంగన్వాడీల శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ సందర్శించి, మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సుభాషిని, జ్యోతి, నారాయణమ్మ, రవణమ్మ, లక్ష్మి, పైడిరాజు, వాణి, నాగమణి, సన్యాసమ్మ, పద్మ, త్రివేణి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు బెదిరింపులు

- విధుల్లో చేరాలని నోటీసులు
- తిరస్కరించిన కార్యకర్తలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అంగన్వాడీలపై ప్రభుత్వం బెదిరింపులకు దిగింది. ఈ మేరకు ఈనెల ఐదో తేదీలోపు సమ్మెను విరమించాలని సూచిస్తూ శృంగవరపుకోట, కొత్తవలస, గంట్యాడ మండలాల్లోని పలువురు సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలకు నోటీసులు అందజేసేందుకు మంగళవారం వెళ్లారు. వీటిని తీసుకునేందుకు సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలంతా నిరాకరించారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కూడా సమ్మె విరమించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీలకు విజ్ఞప్తి, హెచ్చరిక చేశారు. వేతనాలు పెంచే వరకూ సమ్మె విరమించేది లేదంటూ జిల్లా వ్యాప్తంగారున్న అంగన్‌వాడీలు కరాఖండిగా చెబుతున్నారు. ఏ నిర్ణయమైనా కలిసికట్టుగానే ఉంటుందని, ఇటువంటి బెదిరింపులకు లొంగిపోయే చరిత్ర అంగన్‌వాడీలకు లేదని తేల్చిచెబుతున్నారు.

జగన్‌కు అక్కచెల్లెమ్మల ఉసురు తగులుతుంది

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి - జామి, కొత్తవలస, శృంగవరపుకోట

'ఇంట్లో ఆడపిల్ల కంటతడి పెడితేనే మంచిది కాదంటారు... కానీ రాష్ట్రంలోని వేలాది మంది అంగన్వాడీలు 22 రోజులుగా రోడ్డుకెక్కి పోరాడుతుంటే... సిఎం జగన్మోహన్ రెడ్డి కనికరం చూపించడం లేదు. కచ్చితంగా అక్కచెల్లెమ్మల ఉసురు తప్పక జగన్ ప్రభుత్వానికి తగులుతుంది' అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం జామి, కొత్తవలస, శృంగవరపుకోట మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ అంగన్వాడీలు 22 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. చర్చల పేరుతో కాలయాపన తప్ప అంగన్వాడీలకు ప్రయోజనమేమీ చేకూర్చడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఈ నెల ఐదో తేదీలోగా విధులకు హాజరు కాకుంటే కొత్తవారిని నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులిస్తూ బెదిరింపులకు దిగడంపై తమ్మినేని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేసే ప్రశ్నే లేదని స్పష్టంచేశారు. వెంటనే డిమాండ్లన్నీ పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీలతో కలిసి దున్నపోతుకు వినతులు అందించారు. అంగన్వాడీల సమ్మెకు జనసేన నాయకులు ఒబ్బిన సన్యాసినాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, జిల్లా నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజు, నాయకులు కనకమహాలక్ష్మి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, విష్ణుఅమ్మ, కాకర తులసి, శంకరావతి, డి.శ్యామల, డి.జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోటలో ఎద్దుకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని, అంగన్వాడీలు



ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయాలి

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య ఏటా పెరుగుతోందని చెప్పారు. దాంట్లో భాగంగానే డిఎస్‌సి కోసం ఎదురు చూసే వారి సంఖ్య 8 లక్షలపైగా ఉందని చెప్పారు. ఏటా డిఎస్‌సి తీస్తామని ప్రకటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి.. ఒక పోస్టు కూడా భర్తీచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. డిఎస్‌సిలో 8 వేల పోస్టులే ఉన్నాయంటూ మరోవైపు శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అబద్ధాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. కేంద్రం 40 వేల పోస్టులు ఉన్నాయని ప్రకటించిందని, వెంటనే మెగా డిఎస్‌సి తీయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పుడు కూడా మేల్కొనకపోతే రాబోయే ఎన్నికల్లో యువత అంతా తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. మెగా డిఎస్‌సిని ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సతీష్, నాయకులు నాయుడు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

పాయకరావుపేట అసెంబ్లీకి కంబాల జోగులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి జిల్లాలోని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు రంగంలోకి దిగనున్నారు. అరకు ఎమ్‌పి గొడ్డేటి మాధవి అరకు ఈసారి అరకు అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగనున్నారు. ఈమేరకు వైసిపి నిర్ణయం తీసుకుంది. జోగులుకు రాజాం నుంచి టిక్కెట్ ఉండకపోవచ్చన్న ఊహాగానాలు, రాజకీయ విశ్లేషణలు కొంతకాలంగా వెలువడిన విషయం విదితమే. అంతా అనుకున్నట్టే రాజాం అసెంబ్లీ స్థానం నుంచి తప్పించిన వైసిపి అధిష్టానం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి పోటీచేసేందుకు నిర్ణయించింది. దీంతో ఆయన అనుయాయులు, కుటుంబీకుల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమౌతున్నాయి. స్థానికేతరుడైన జోగులుకు పాయకరావుపేట నుంచి ఏమేరకు నెగ్గుకురాగరో వేచిచూడాల్సిందే.

సక్రమంగా రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

కార్డుదాలందరికీ సక్రమంగా రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. విజయనగరం పట్టణంలోని కణపాక ప్రాంతంలో ఎండియు-6 వాహనం ద్వారా చేపడుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, గోధుమ పిండి, కందిపప్పు పంపిణీని పరిశీలించారు. సరుకుల నాణ్యత, నెలనెలా పంపిణీపై కార్డుదారులను ఆరా తీశారు. ప్రభుత్వం ఇస్తున్న సరుకులు సరిపోతున్నాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని ప్రతిఒక్కరూ వినియోగించాలని సూచించారు. ఎండియు వాహన ఆపరేటర్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరా అధికారి కె.మధుసూదనరావు, డిటిలు, సిబ్బంది పాల్గొన్నారు.



కందిపప్పును పరిశీలిస్తున్న జెసి అశోక్

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన హాసిని

దక్షిణ భారతస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో రాజాం మండలం డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఐ.హాసిని సత్తాచాటింది. హాసిని రూపొందించిన స్మార్ట్ ట్రాలీ ప్రయోగానికి రాష్ట్ర స్థాయిలో విద్యార్థి వ్యక్తిగత విభాగంలో ప్రథమ బహుమతి వచ్చింది. మాల్స్, సూపర్ మార్కెట్, షాపుల్లో సరుకులు రవాణా సులువుగా చేయుటకు ఇది ఉపయోగ పడుతుంది. స్వయం నియంత్రణతో పనిచేస్తూ వృద్ధులకు, వికలాంగులకు ఉపయోగపడుతుంది. ఈ నెల 27 నుంచి విజయవాడలో జరిగే దక్షిణ భారత స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఈ స్మార్ట్ ట్రాలీ పాల్గొంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ఐ.హాసినిని డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎం.శ్రీదేవి, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.



విద్యార్థి హాసినిని అభినందిస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

ఇళ్ల స్థలాల మంజూరుకు

జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు


ప్రజాశక్తి-విజయనగరం

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటుచేస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఛైర్మన్‌గా, కలెక్టర్, డిఆర్‌ఒ, ఆర్‌డిఒ, డిఐపిఆర్‌ఒ, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా ఈ కమిటీలో ఉంటారని తెలిపారు. జర్నలిస్టుల విభాగం నుంచి అల్లు సూరిబాబు (బ్యూరో చీఫ్, సాక్షి), వ్రి వెంకట జగన్నాథరావు (స్టాఫ్ రిపోర్టర్, ఎన్‌టివి), మత్స మహాలక్ష్మి నాయుడు (స్టాఫ్ రిపోర్టర్, 10 టివి) సభ్యులుగా ఉన్నారని చెప్పారు.

ఈ కమిటీ జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు గుర్తించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించిందని వెల్లడించారు. కమిటీ పరిశీలన అనంతరం పూర్తిస్థాయిలో ఇళ్ల స్థలాలకు అర్హులైన జర్నలిస్టుల తుది జాబితా రూపొందిస్తామని చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం జిల్లాలో ఇప్పటి వరకు 220 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ నెల 6తో గడువు ముగుస్తుందని, అర్హులైన జర్నలిస్టులంతా ఆన్‌లైన్ ద్వారా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అవ్వాతాతలకు అండగా..

- నేటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ
- ఒక్కొక్కరికీ రూ.3 వేలు పింఛను
- జిల్లాలో 2,85,675 మందికి లబ్ధి



బయోమెట్రిక్ వేసి పింఛను పంపిణీ చేస్తున్న వాలంటీర్

ప్రజాశక్తి-విజయనగరం

అవ్వాతాతలు, ఏ తోడూ లేని వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, వికలాంగులకు ఆసరాగా నిలిచే పింఛను మొత్తాన్ని ప్రభుత్వం రూ.3 వేలకు పెంచింది. అట్టడుగు వర్గాలకు సామాజిక భద్రతను, సాంఘిక గౌరవాన్ని కల్పించే వైఎస్ఆర్ పింఛను కానుక పథకంలో భాగంగా ఇటీవల ఏడు రకాల సామాజిక పింఛన్లను రూ.3 వేలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఈ పెరిగిన పింఛన్లు, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలో బుధవారం ప్రారంభం కానుంది.

డిసెంబరు వరకు పింఛన్ల సంఖ్య జిల్లాలో 2,82,748 ఉండేది. వీటికోసం నెలకు సుమారుగా రూ.76.95 కోట్లను వెచ్చించేవారు. కొత్తగా మరో 3,709 పింఛన్లు మంజూరయ్యాయి. జిల్లాలో మొత్తం పింఛన్ల కోసం నెలకు సుమారు రూ.83.54 కోట్లను వెచ్చించారు. వాస్తవానికి 2019 మే నాటికి జిల్లాలో పింఛన్ల సంఖ్య 2,27,861 ఉండేది. వీటికోసం నెలకు సుమారుగా రూ.53.46 కోట్లను ఖర్చు చేసేవారు. అప్పుడు నెలకు రూ.2వేలు చొప్పున పింఛను ఇచ్చేవారు.

రూ.3 వేలకు చేరిన పింఛను

వైఎస్ జగన్ మోహనరెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన మరుసటి నెల నుంచే పింఛను మొత్తం రూ.250 పెరిగింది. అప్పటినుంచి ఏటా రూ.250 చొప్పున పెంచుకుంటూ ఈ నాలుగేళ్లలో పింఛను రూ.3 వేలకు చేరింది. పింఛన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2020 జనవరి నుంచి 2021 జులై మధ్య 44,735, 2022 జనవరిలో 7,093, 2023 జనవరిలో 19,924 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది 3,709 పింఛన్లు పెరిగాయి. ఈ నాలుగేళ్లలో జిల్లాలో పింఛన్ల సంఖ్య 75,461 పెరిగి, మొత్తం పింఛన్ల సంఖ్య 2,85,675కు చేరుకుంది. ఈ జనవరి నుంచి అదనంగా నెలకు సుమారు రూ.1.11 కోట్లు వెచ్చిస్తున్నారు.

ఠంఛనుగా పింఛను

ఒకప్పుడు పింఛను అందుకోవడం కోసం నెలనెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పడరాని పాట్లు పడేవారు. గ్రామాల్లో ఎక్కడో ఒకచోట పింఛన్ల పంపిణీ జరిగేది. పింఛను ఎప్పుడిస్తారో, ఎక్కడిస్తారో తెలిసేది కాదు. వృద్ధులు, వికలాంగులు పింఛను కోసం క్యూల్లో నిలబడలేక నానా అవస్థలూ పడేవారు. పైగా పింఛను అందుకోగానే వందో రెండొందలో లంచంగా ఇవ్వాల్సి వచ్చేది. ఈ కష్టాలకు పరిష్కారంగా ప్రభుత్వం రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటికే చేర్చారు. వాలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దకే ఠంఛన్‌గా పింఛను పంపిస్తూ, వారి కష్టాలను తొలగించారు. జబ్బుపడ్డ వారికి ఆసుపత్రులకు పింఛను పంపించి ఆపత్కాలంలో సైతం ఆదుకుంటున్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- ఎ.కల్యాణచక్రవర్తి, డిఆర్‌డిఎ పీడీ

జిల్లాలో బుధవారం నుంచి పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ముందుగా పింఛన్ల పెంపు కార్యక్రమాన్ని కాకినాడలో ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారం చేస్తాం. అనంతరం జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. బొబ్బిలి అర్బన్, కొత్తవలస, సంతకవిటి, వేపాడ మండలాల్లో కూడా బుధవారమే కొత్త పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమాలు

- 3న బొబ్బిలి అర్బన్, కొత్తవలస, సంతకవిటి, వేపాడ, విజయనగరం.
- 4న భోగాపురం, డెంకాడ, గజపతినగరం, జామి, ఎల్.కోట, మెరకముడిదాం, తెర్లాం, వంగర, విజయనగరం కార్పొరేషన్.
- 5న బాడంగి, చీపురుపల్లి, దత్తిరాజేరు, పూసపాటిరేగ, రేగిడి, ఎస్.కోట.
- 6న బొండపల్లి, గరివిడి, నెల్లిమర్ల, నెల్లిమర్ల అర్బన్, రాజాం, రామభద్రపురం.
- 8న బొబ్బిలి, గంట్యాడ, గుర్ల, మెంటాడ, రాజాం అర్బన్.

మంత్రి ఇంటిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మంత్రి విడదల రజిని కార్యాలయంపై దాడికి దిగిన వారిపై కఠినంగా శిక్షించాలని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిసి మహిళపై దాడి జరిగినా ప్రతిపక్ష టిడిపి నాయకులు నోరు మెదపకపోవడాన్ని ఆక్షేపించారు. మహిళలపై దాడులను ప్రోత్సహించే విధంగా టిడిపి ప్రవర్తిస్తున్న తీరు గర్హనీయమన్నారు. టిడిపి నేతలు బూతు పురాణానికే పరిమితం అవుతున్నారని, మహిళలకు కనీస గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎఎంసి చైర్ పర్సన్ శశి భార్గవి, మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మెడకు ఉరితాళ్లతో నిరసన

13వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరంలో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు గురువులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా మెడకు ఉరితాళ్లు వేసుకునే విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి బొత్స చర్చలు జరిపి ఎటువంటి పరిష్కారమూ చూపకుండా సమ్మెను విరమించాలని కోరడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని, సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



మెడకు ఉరితాడు బిగించుకుని నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

'గురజాడ'లో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక గురజాడ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ ఫర్ హ్యాపీనెస్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామర్, సైక్రాటిస్టు డాక్టర్ మౌనిక తేజస్విని మాట్లాడుతూ ఫిజికల్ హెల్త్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలు, మెంటల్ హెల్త్‌కి పాటించవలసిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి, కార్యదర్శి వి.నీత, రోటరీ మెంబర్ డాక్టర్ రామమూర్తి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

విజయనగరం టౌన్ : కణపాకకు చెందిన రెడ్డి తవుడు గతంలో ఇంటి మేడపైనుంచి పడటంతో వెన్నెముక దెబ్బతింది. తమకు బతుకు తెరువు కోసం చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరిసహస్రను ఆ కుటుంబం సాయం కోరింది. వెంటనే ఆమె స్పందించి తోపుడు బండి, ఫ్యాన్సీ స్టోర్ సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కలయికతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి, జనసేన కలయికతో ప్రజలకు ప్రయోజనం జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు తెలిపారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 40వ డివిజన్ పరిధిలో పోలయ్యపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టిడిపి మినీ మేనిఫెస్టో హామీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు పాల్గొన్నారు.



అదితికి తిలకం దిద్దుతున్న మహిళ

పూర్తి నివేదిక ఇవ్వాలి

• తహశీల్దార్‌కు జెసి ఆదేశం

• ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణలో అధికారుల తప్పిదంతో మహిళా రైతు విలువైన భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. గతంలో సేకరించిన భూమికి పరిహారం ఇచ్చినప్పటికీ పరిహారం ఇవ్వకుండా మరో 40సెంట్లు భూమిలో నుంచి అప్రోచ్ రోడ్డుకు సరిహద్దు రాళ్లు వేశారు. దీంతో ఆ మహిళా రైతు సుమారు కోటి రూపాయలు విలువైన భూమిని నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. దీనిపై మంగళవారం ప్రజాశక్తిలో అధికారుల తప్పిదం.. రైతుకు శాపం అనే ప్రత్యేక కథనం వెలువడింది. ఈ కథనం పై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించారు. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని స్థానిక తహశీల్దార్ చింతాడ బంగార్రాజును ఆదేశించారు. మరో పక్క ఆర్‌డిఒ సూర్యకళ కూడా దీనిపై స్పందించారు. బాధిత మహిళా రైతు మాతా శిరోమణికి ఆర్‌డిఒ కార్యాలయానికి రావాలని మంగళవారం విఆర్‌ఒ ద్వారా సమాచారం ఇచ్చారు. తప్పని సరిగా హాజరుకావాలని వాట్సప్ ద్వారా కూడా నోటీసు అందించారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ గ్రామంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఆ గ్రామ సర్పంచ్ ఎన్ వెంకటరావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, వైస్ ఎంపిపి ఎ.ఈశ్వరరావు, అరిగిపాలెం ఎంపిటిసి టివి రమణ, ఇఒపిఆర్‌డి ఉమా, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి. రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాధిత కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మరణించిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి ఓదార్చనున్నారు. భోజన సమయానికి బొబ్బిలి చేరుకుని భోజనం తరువాత 2గంటలకు వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించి తెర్లాం మండలం వెళతారు. తెర్లాం మండలంలోని మోదుగవలసలో ఒకరు, పెరుమాలిలో ఒకరు మరణించిన విషయం తెలిసిందే. ఆయా కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారు. భువనేశ్వరి పర్యటన రూట్ మ్యాప్‌ను టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా మంగళవారం పరిశీలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రూపు-2 అభ్యర్థులకు అవగాహన

బొబ్బిలి: గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కె.విజయగౌరి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మోహనరావు సదస్సును ప్రారంభించి ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ విద్యావేత్త, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెవిఎస్.లక్ష్మణరావు రాసిన 150 పేజీలు పుస్తకాన్ని సదస్సుకు హాజరైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సదస్సులో గ్రూప్-2 కోచింగ్ నిపుణులు సర్వేశ్వరరావు సబ్జెక్టును వివరించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు పి.సత్యనారాయణ, సామాజిక కార్యకర్త శర్మ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ పుస్తకాలు పంపిణీ

రేగిడి: మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా సమగ్ర శిక్ష నుంచి లైబ్రరీ పుస్తకాలు వచ్చినట్టు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఈ పుస్తకాలు అందజేయాలని ప్రధానోపాధ్యాయులను సూచించారు. పాఠశాల విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, పిఆర్‌టియు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ

శృంగవరపుకోట: మండలంలోని వినాయకపల్లి ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ గైర్హాజరును గుర్తించామన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వ్యవహారంపై ఎమ్మెల్సీ ప్రశ్నించగా వారంలో రెండు మూడు రోజులు ఆయన గైర్హాజరవుతారని చెప్పారు. వెంటనే ఎమ్మెల్సీ ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేసి, పాఠశాలలోని పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టమని సూచించారు. గతంలో తల్లితండ్రుల నుండి ప్రధానోపాధ్యాయులు రమణ పై పలు ఫిర్యాదులు అందాయని, ఈ విషయమై తాను మండల విద్యాశాఖాధికారితో మాట్లాడినప్పటికీ పరిస్థితిలో మార్పురాని కారణంగా తాను ఆకస్మికంగా సందర్శించాల్సి వచ్చిందని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ వెలుచూరి కృష్ణంనాయుడు, నాయకులు వెలుచూరి కొండబాబు, వెలుచూరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండావిష్కరణ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ స్థానిక ఆటో జంక్షన్ వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నెల్లిమర్ల డివిజన్ పూసపాటిరేగ మండల అధ్యక్షులు కనకల పద్మనాభం, తెలుగు సూరిబాబు, గురువులు నాయకులు రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

భోగాపురం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దారు బంగార్రాజు మంగళవారం పరిశీలించారు. చెరుకుపల్లి, పోలిపల్లి, లింగాలవలసలో పాటు సుమారు 28 కేంద్రాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వికలాంగులు వెళ్లేందుకు ర్యాంప్ తదితర అంశాలపై తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు.

వృత్తిదారుల హక్కులను కాపాడుకోవాలి

శృంగవరపుకోట : రాష్ట్రంలోని కల్లుగీత వృత్తిదారుల హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కలిసికట్టుగా కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సుబ్బారామిరెడ్డి కళ్యాణ మండపంలో కల్లుగీత వృత్తిదారుల సంఘ నియోజకవర్గ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కామేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, నేటి ప్రభుత్వ పెద్దలు కల్లుగీత వృత్తి దారులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈ సదస్సులో సిపిఐ నియోజకవర్గ నాయకులు మద్ది కృష్ణ, కండిపల్లి భీముడు, గీత కార్మికుల సంఘ నేతలు కుప్ప రమణ, పైడిరాజు, కె.అర్జునరావు, దేముడు, కొట్యాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి చిన్నఅప్పలనాయుడు, వైసిపి నాయకులు

ధాన్యం కొనుగోళ్లలో దళారులదే హవా

• ప్రభుత్వంపై నమ్మకం లేక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు • అదనంగా ధాన్యం చెల్లించి మోసపోతున్న వైనం • ట్రక్ షీట్ పేరిట రూ.50 వసూలు

ప్రజాశక్తి - గుర్ల

రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కూడా తాను నచ్చిన విధంగా అమ్ముకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు పంటపై పడి దోచుకుంటున్నారు. ప్రభుత్వం ధర కూడా ఇవ్వకుండా వారికి నచ్చిన ధరను రైతుకు ఇచ్చి సుమారు 7 కిలోలు అదనంగా తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ట్రక్ చీటి విధానంలో జరుగుతున్న మతలబు వల్ల రైతులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించలేకపోతున్నారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన తరువాత ట్రక్ చీటీలు జెనరేట్ చేస్తారు. అయితే సిబ్బంది వారికి నచ్చిన విధంగా అర్థ రాత్రి 12 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ట్రక్ చీటీలు జెనరేట్ చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అర్థ రాత్రి సమయంలో ట్రక్ చీటిలు జనరేట్ చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సమయంలో 80 శాతం దళారులు సూచించినట్లే ట్రక్ చీటీలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. సహకార సంఘాల, అధికారపార్టీ నాయకుల, అధికారుల అండ దండలతో ఈ వ్యవహారం సాగుతుందని రైతులు బాహాటంగా చెప్పుకుంటున్నారు. కొంత మంది రైతుల నుంచి ట్రక్ చీటి నిమిత్తం సిబ్బంది రూ.50వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

రైతులను నమ్మబలికి మోసం

సమయానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం, ఒకవేళ చేసినా సౌకర్యాలు లేకపోవడం, రైతుల పట్ల సిబ్బంది దురుసు ప్రవర్తన వెరసి దళారులకు కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చును. దీంతో దళారులు రెచ్చిపోతున్నారు. కొంత మంది దళారులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలంటే గోనె సంచులు కొనాలి, ట్రక్ చీటి జనరేట్ చెయ్యాలి, జిపిఎస్ వాహనానికి సమకూర్చాలి, అన్ లోడింగ్ చార్జీలు మిల్లర్లకు ఇవ్వాలి, తరుగుదల కింద ధాన్యం క్వాలిటీని బట్టి క్వింటాకీ 5 నుండి 10 కేజీల తరుగు పోతుందని రైతులను భయభ్రాంతులకు గురి చేసి తామైతే వెంటనే డబ్బులు ఇచ్చేస్తామని రైతును బలహీన పర్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దళారులు క్వింటాకు రూ. 2వేలు చెల్లించడంతో పాటు అదనంగా 7కిలోలు ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ఇది ప్రభుత్వం చెల్లించే ధర కంటే తక్కువే అయినప్పటికీ రైతుకు ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో చాలా మంది దళారులనే ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై దృష్టి సారించి రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు భరోసాగా సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తరలింపునకు దళారులు సిద్ధంగా ఉంచిన ధాన్యం లారీ

దళారులవైపే రైతు మొగ్గు

వేపాడ: మండలంలో ఈ ఏడాది వరి పండించిన రైతు ప్రభుత్వ విధానం నచ్చక దళారులవైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ధాన్యం కొనుగోలు బిల్లులు వద్ద రకరకాల విధానాలతో పండించే ధాన్యాన్ని తీసుకోవడానికి ఆంక్షలు విధించడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లేందుకు రైతులు విముఖత చూపుతున్నారు. మిల్లర్లు దోపిడీ విధానాన్ని తట్టుకోలేక అధిక శాతం మంది రైతులు రూ.1500 నుంచి రూ. 1550 రూపాయలు ఇచ్చినా దళారుల చేతికే పంటను అప్పగించేస్తున్నారు. కాగా దళారులు నేరుగా పొలాలు వద్దకే వచ్చి దాన్యాన్ని కొనుగోలు చేసి పట్టుకెళ్లిపోతున్నారు. దీంతో చాలా మంది రైతులు ధర తక్కువే అయినా ట్రావెలింగ్ ఇబ్బంది ఉండదని, మిల్లర్ల గొడవ, సిబ్బంది వేధింపులు ఉండవని దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇదే అలుసుగా తీసుకుంటున్న దళారులు రైతును దోచుకుంటున్నారు.

ఆరోగ్య సురక్ష అభాసుపాలు

• మొహం చాటేసిన రోగులు

• ఇంటింటికీ వెళ్లి పిలిచినా రాని జనాలు

• ఆపసోపాలు పడి పిట్టాడలో వంద మందికి చికిత్స

• ఆతవలో వెలవెలబోయిన శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష -2 ఆభాసుపాలయ్యింది. రోగులు లేక శిబిరం వెలవెల బోయింది. జగనన్న సురక్ష 1 కార్యక్రమం మొట్టమొదట పిట్టాడలో సెప్టెంబర్‌లో లాంఛనంగా (ఫైలెట్ ప్రాజెక్ట్) ప్రారంభించారు. కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ఆర్భాటం చేశారు. సురక్ష -2 కూడా మంగళవారం పిట్టాడలో ప్రారంభించారు. స్థానిక సర్పంచ్, ఎంపిపి స్వగ్రామం అయినా శిబిరానికి జనాలు హాజరు కాలేదు. సుమారు 12 గంటలు అయినప్పటికీ ఎవరూ రాకపోవడంతో స్థానిక వైసిపి నాయకునితో శిబిరాన్ని ప్రారంభించారు. తరువాత కొద్దిసేపటికి ఎంపిడిఒ త్రివిక్రమ రావు వచ్చారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు వచ్చి వున్నపాటి కొద్దిమంది రోగులతో ఫోటోలు దిగి వెనుదిరిగారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి సచివాలయం పరిధిలో సుమారు 612 మందిని నమోదు చేశారు. వీరెవరూ శిబిరానికి రాలేదు. దీంతో సిబ్బంది వంద మందిని శిబిరానికి తీసుకు రావడానికి ఆపసోపాలు పడ్డారు. వాలంటీర్లు, వెలుగు సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి శిబిరానికి రమ్మని కోరినా జనాలు ముఖం చాటేశారు.

ఆకలి కేకలు : శిబిరానికి తీసుకువచ్చిన రోగులకు కనీసం మంచినీరు సౌకర్యం కల్పించలేదు. వైద్యులకు మినహా రోగులకు, వచ్చిన ఆశాలు, సిబ్బందికి భోజనాలు లేక ఇబ్బందులు పడ్డారు.

తొలి రోజు తుస్..!

వేపాడ: మండలంలో ఆతవ గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమ జనాలు లేక వెలవెల బోయింది. ఈ వైద్య శిబిరంలో అధికారులు ఎక్కువ రోగులు తక్కువగా కనిపించారు. దీంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఇంతమంది సిబ్బంది ఈ వైద్య శిబిరానికి అవసరమా సిబ్బందిని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామనాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి ఉమా, సర్పంచ్ గొంప వేమన రామునాయుడు, వైద్యాధికారులు ఎ. ధరణి, వరలక్ష్మి, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ వివిఎన్ మల్లేష్, కంటి వైద్యులు సిహెచ్ మల్లేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నానిబాబు, పాల్గొన్నారు.



మెంటాడ: జనాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రోడ్డు బాగు చేయాలని ఎమ్మెల్సీకి వినతి

ఆతవ జంక్షన్ నుండి గ్రామానికి రెండు కిలోమీటర్ల పైగా ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని వెంటనే రోడ్డును బాగు చేయాలని ఎమ్మెల్సీ రఘురాజును కోరుతూ గ్రామస్తులు వినతినిచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు బిల్లులు అందక రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిపేశారని దీనికి తాను ఏమీ చేయలేనని గ్రామస్తులంతా కలిసి వస్తే మంత్రి బొత్స దృష్టికి తీసుకెళదామని బదులిచ్చారు.

ప్రజలు ఆరోగ్యమే ప్రధానంగా 'ఆరోగ్య సురక్ష' : జెడ్ పి చైర్మన్

మెరకముడిదాం: ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా ఈ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గర్భాం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించి ఏఏ మందు ఇస్తున్నారు, ఏఏ రోగాలకు తనిఖీలు చేస్తున్నారన్న విషయాలను పరిశీలించారు. 350 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ వెంకటేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు, మండల ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణ రాజు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు, సత్తారు జగన్ మోహనరావు, బూర్లె నరేష్, పప్పల కృష్ణమూర్తి, గర్భాం పిహెచ్‌సి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్సీ డాక్టర్ పి. వివి సూర్యనారాయణ రాజు అన్నారు. మంగళవారం రామతీర్థం గ్రామ సచివాలయంలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ పేదవాడు ఆరోగ్యంగా జీవనం సాగించాలని, ఆరోగ్యం ఉంటేనే ఆనందం ఉంటుందని ఆరోగ్య సురక్ష ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, స్థానిక నాయకులు, సతివాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెరకముడిదాం: శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్మన్

తెర్లాం: మండల కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి ఉమాలక్ష్మీ, ఎంపిడిఒ ఎస్. రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సత్యనారాయణ, తెర్లాం పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని ముసిరాం సచివాలయ పరిధిలో నంబారువానిపాలెం, గొల్లలపాలెంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, విరోతి కొండల రావు, బలిఘట్టం ఆదిరెడ్డి అప్పన్న, ముసిరం పైడంనాయుడు, గొల్లలపాలెం సర్పంచ్ నీలాద్రి బాలమణి, రమణ, రాముడు యుడు, దమ్ము రమణ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొండపల్లి

రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్యకర్తలకు తప్పకుండా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వేంద్రాం సమీపంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు అధ్యక్షతన బొండపల్లి మండల సర్పంచ్ లు, ఎంపిటిసిలు పలువురు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికలలో కార్యకర్తల కృషి ఫలితంగా మండలంలో ఆరు వేల ఓట్ల పై చిలుక మెజారిటీ వచ్చిందని గుర్తు చేశారు. ఇటీవల బొండపల్లి మండలంలో వైసిపి పార్టీకి మెజారిటీ రాదని కొన్ని సర్వే సంస్థలు సూచిస్తున్నాయని, పార్టీలో కార్యకర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు ఉన్నప్పటికీ అవి సర్దుకుంటాయని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో కష్ట బడిన కార్యకర్తలందరికీ న్యాయం చేయలేకపోయామని, వచ్చే ఎన్నికలలో వైసిపిని గెలుపించుకుంటే కార్యకర్తలకు న్యాయం చేస్తామని చెప్పారు. ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బొండపల్లి మండలలంలో వైసిపికి పదివేలు మెజార్టీ తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మెన్ వేమలి ముత్యాలు నాయుడు, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, గొల్లు సతీష్ కుమార్, మండల గృహ సారధుల కన్వీనర్ పల్లి రఘు, నాయకులు ఈదిబిల్లి కృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

బొబ్బిలి: ప్రజాప్రతినిధులు, నాయకులు, సమన్వయంతో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని మండల, టౌన్ నూతన కార్యవర్గ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో పార్టీ ఇటీవలే నూతనంగా నియమించిన మండల/టౌన్ పార్టీ కార్యవర్గ సభ్యులతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశామన్నారు. ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేసిన మంచిని వివరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, జెసిఎస్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామపంచాయతీ పరిధిలోని గదభవలసలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ మేనేజర్ సుమ సాహూ పర్యటించారు. ఆమెతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి పి. రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి టి.చంద్రశేఖర్ రావు బృందంగా ఏర్పడి పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటికీ సర్వే చేశారు. గిరిజనులకు పక్కా ఇల్లు, ప్రతీ ఇంటికి మంచి నీటి కుళాయి, గ్రామ గ్రామానికి రహదారులు నిర్మాణం, ప్రతీ ఇంటికి విద్యుత్, అందరికి నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ పౌష్టిక ఆహారం, ఆరోగ్యం, జీవన ఉపాధులు మెరుగుపరచడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎచ్చెర్ల సునీత, ఎంపిటిసి మరడాన చిన్నమ్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్రాలు తెరవకపోవడంపై ఆగ్రహం

ప్రజాశక్తి- మెంటాడ

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో కొనసాగుతుండటంతో ఫ్రీ స్కూల్ పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. మంగళవారం పిట్టాడ అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒ త్రివిక్రమరావు పరిశీలించగా ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వాటిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. రెండు కేంద్రాలకు కలిపి సుమారు 15 మంది ఫ్రీ స్కూల్ పిల్లలు వున్నారు. కానీ ఒక్కరూ హాజరు కాలేదు. పిల్లలు ఎందుకు రాలేదని ఎంపిడిఒ ప్రశ్నించగా వచ్చి వెళ్లారని మహిళా పోలీసు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ బదులిచ్చారు. 12 గంటలు అవ్వక ముందు ఎందుకు పంపేశారని ప్రశ్నించగా సిబ్బంది అసలు విషయం బయటపెట్టారు. ఇంటి నుంచి పిల్లలను కేంద్రాలకు తీసుకు వచ్చి, మరలా ఇంటికి పంపిస్తే పిల్లలను కేంద్రాలకు పంపిస్తామని పిల్లల తల్లి దండ్రులు తెగేసి చెబుతున్నారని చెప్పారు. చిన్నారులను రోడ్డుపై వదిలేస్తే ప్రమాదాలకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని అడుగుతున్నారని చెప్పారు. ఇవన్నీ చూసుకోవడం తనవల్ల కాదని చెప్పారు. అంగన్వాడీ స్టాకును, ఎండిఎం వంటలను ఎంపిడిఒ పరిశీలించారు. స్కూల్ పిల్లలకు గుడ్లు, పులిహార, పచ్చడి సిద్ధం చేశారు. ఫ్రీ స్కూల్ పిల్లలకు అన్నం పప్పు ఇవ్వవలసి వుండగా, స్కూల్ పిల్లలకు సిద్ధం చేసిన పులిహార ఇవ్వనున్నట్లు ఎండిఎం నిర్వాహకులు తెలిపారు. అందరు పిల్లలు ఒకే చోట భోజనం చేసినా ఒకరికి ఒకలా, మిగతా వారికి ఇంకోలా వడ్డించడం ఏమిటని అక్కడ వున్న వైసిపి నాయకుడు రెడ్డి రాజప్పల నాయుడు ప్రశ్నించారు. ఇంతలో మండల ప్రత్యేకాధికారి వస్తున్నారని తెలిసి హుటాహుటీన గ్రామ వి.అర్ఎ వెళ్ళి నలుగురు చిన్నారులను తీసుకొని వచ్చారు.

ఆ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ భూముల్లో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలపై కొండలింగాలవలస, ఆంద్ర, జయతి, గుర్ల, జిటిపేట, లోతుగెడ్డ పంచాయితీలలో మధుర గ్రామాల గిరిజనులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలపై తహశీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొండలింగాలవలస సర్పంచ్ పాడి వరహాలమ్మ, గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు, పలు గ్రామాల పార్టీ నేతలు, గేదెల పెదరాం, ఏలుసూరి ప్రకాశ్, అగతాన గణేష్, సిడగం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

నేరాలు ఘోరాలు

బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు అన్నపూర్ణ (27) బావిలో పడి మృతి చెందింది. మృతురాలి తల్లీ కర్రీ లక్ష్మి చెప్పిన వివరాలు ప్రకారం.. 2019లో కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు రామారావుకు అన్నపూర్ణను రెండో భార్యగా వివాహం చేశారు. వీరిద్దరూ అదే గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకుని కాపురం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో గర్భవతి అని కూడా చూడకుండా రామారావు అన్నపూర్ణను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో ఆమె పుట్టింటికి వచ్చింది. సర్ది చెప్పి తిరిగి పంపించాను. సోమవారం మా ఇంటి వద్దనే ఉన్న అన్నపూర్ణ, రామారావు కొత్త చెరువు దగ్గర ఉన్న పొలంలో పనికి వెళ్తు దారిలో గొడవలు పడ్డారు. మళ్ళీ సాయంత్రం మా అల్లుడు ఇంటికి వచ్చి మీ అమ్మాయి ఏది అని అడిగాడు. అదేంటి ఇద్దరూ కలిసి ఉదయం పనికి వెళ్లారు కదా మళ్లీ నన్ను అడుగుతున్నావేంటి అని ప్రశ్నించాను. దీంతో ఇంటికి వెళ్లి పోయాడు. వెంటనే మా బంధువులు, ఊరులో వారిని వెంట పెట్టుకొని వెళ్తే కొత్త చెరువు పొలంలోని నేలబావిలో శవమై కనిపించిందని తల్లి బోరున విలపించింది. మృతురాలికి మూడేళ్ల పాప ఉంది. తెర్లాం ఎస్ఐ రమేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రుని వివరాలు ఆరా తీస్తున్న జెడ్‌పి చైర్మన్

వ్యక్తికి గాయాలు

స్పందించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మొయిద నారాయణ పట్నం బ్రిడ్జి వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొట్టి వ్యక్తికి గాయాలయ్యాయి. గరివిడి మండలం గెడ్డపువలసకు చెందిన వాలంటీర్ బాలాజీ ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా ఆటో ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యాడు. అదే రహదారిలో గుర్ల మండలం ఆనందపురం గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని విజయనగరం వెళుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వాహనాన్ని ఆపి ప్రమాదానికి గురైన వ్యక్తిని 108కి కాల్ చేసి వాహనం వచ్చే వరకు దగ్గరుండి పర్యవేక్షించారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె

స్పష్టంచేసిన మున్సిపల్ కార్మికులు

8వ రోజు సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల డిమాండ్లన్నీ నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగుతుందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.వి.రమణ, నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు స్పష్టంచేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభించి, గంటస్తంభం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.త్రినాథ్, మున్సిపల్ యూనియన్ నాయకులు భాస్కరరావు, రజిని, కృష్ణ, రామచంద్రరావు, ఆదినారాయణ, చంద్రరావు, పైడిరాజు, కుమారి, రమ, రాఘవ, లక్ష్మణరావు, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె మంగళవారం కొనసాగింది. రామారావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రిటైర్డ్ బెన్ ఫిట్ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి. హరిబాబు, జె.శ్రీను, బి. రాము, టి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు